క్లుప్తంగా

అర్బన్ బ్యాంక్ కార్యవర్గానికి అభినందన

సిరిసిల్లటౌన్: అర్బన్‌బ్యాంకు నూతన చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి తదితరులు శనివారం సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని చైర్‌పర్సన్ జిందం కళ దంపతులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బ్యాంకు నూతన డైరెక్టర్లు ఎనగందుల శంకర్, అడ్డగట్ల దేవ దాసు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం సోమారంపేట గ్రామానికి చెందిన సీహెచ్.రాజ్యలక్ష్మి అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా చికిత్స నిమిత్తం రూ.2 లక్షల ఎల్‌వోసీని శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. ఇల్లంతకుంట ఎంపీపీ వుట్కూరి వెంకటరమణా రెడ్డికి ఎల్‌వోసీ అందించి బాధిత కుటుంబ సభ్యులకు అందించాలని సూచించారు.

విద్యార్థికి సన్మానం

వేములవాడరూరల్: నీట్ ఫలితాల్లో ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థిని మున్సిపల్ కౌన్సిలర్ రెండుమిద్దెల జయ అభినందించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి వార్డుకు చెందిన గుడిసె జేమ్స్ ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో అర్హత సాధించాడు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థిని, వారి తల్లిదండ్రులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సలీం, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్‌లో చత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. శివాజీ సేన ఆధ్వర్యంలో చేపట్టిన విగ్రహ నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. జెడ్పీటీసీ నర్సయ్య, శివాజీ యువసేన అధ్యక్షుడు రవి, కోశాధికారి అంజిరెడ్డి, కార్యదర్శి స త్యం, ప్రచారక్ సొల్ల క్రాంతి, మిర్యాల్‌కార్ శ్రీ నివాస్, విశ్వనాథ్, వేణు, సతీశ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'విజయవంతం చేయండి'

తంగళ్లపల్లి: వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య అన్నారు. శనివారం ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో ఉపాధిహామీ కూలీలతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం నర్సయ్య మాట్లాడుతూ ఈనెల 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు జిల్లాలోని ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ మేట్లు, కూలీలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేత

ముస్తాబాద్: మండల వనరులకేంద్రంలో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్‌ను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శనివారం అందజేసినట్లు నోడల్ ఆఫీసర్ రాజిరెడ్డి తెలి పారు. ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నోట్ బుక్స్ అందించినట్లు తెలిపారు. పాఠశాలల పునఃప్రా రంభం నాటికి పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ పూర్తిచేస్తామన్నారు. ఎమ్మార్సీ సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, తుమ్మ రాజేందర్, రమాదేవి, సీఆర్‌పీ దేవరాజు, పరశురాములు, రాజు, జయంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే చేరండి

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ కళాశాలల్లో అన్ని వసతులు కల్పిస్తూ నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండలంలోని నారాయణపూర్, రాగట్లపల్లి, ఎల్లారెడ్డిపేటలో ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ కళాశాలల్లో కల్పిస్తున్న వసతులపై వివరించారు. అధ్యాపకులు పర్శరాములు, చంద్రమౌళి, చెరుకు భూమక్క, గీత, సాగర్, ప్రవళిక పాల్గొన్నారు.

'భాషా పండితుల పోస్టులను కామన్ సీనియారిటీ ద్వారా భర్తీ చేయాలి'

ఎల్లారెడ్డిపేట: స్కూల్ అసిస్టెంట్ భాషాపండితుల పోస్టులను కామన్ సీనియారిటీ, 11, 12 జీవోలలో పేర్కొన్న విద్యార్హతల ప్రకారం భర్తీ చేయాలని తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీటీఏ) జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేటలో శనివారం మాట్లాడారు. గతంలో నిబంధనలకు విరుద్ధంగా డిప్లొమా కోర్సుతో సమానమైన పండిట్ ట్రెయినింగ్ గల వారికి పదోన్నతులు ఇచ్చారన్నారు. డిప్లొమా కోర్సులు గల వారికి పదోన్నతులు ఇవ్వడం సాధ్యం కాదని ఎన్‌సీఈఆర్టీ జారీ చేసిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సమావేశంలో టీఎస్‌పీటీఏ జిల్లా నాయకులు విజయ్‌కుమార్, ప్రశాంత్, రాజు, రవీందర్ పాల్గొన్నారు.

అదిరే టాయ్స్.. కిడ్స్ చాయిస్

- చిన్నారులను ఆకట్టుకునేలా..
- మార్కెట్లో కొనుగోళ్ల సందడి
- ఈనెల 12నుంచి పాఠశాలలు ప్రారంభం

సిరిసిల్లటౌన్: ఈనెల 12న పాఠశాలలు ప్రారంభంకానున్నాయి. చిన్నారుల కోసం వారికి నచ్చే బొమ్మల రూపంలో స్కూల్ టాయ్స్ మార్కెట్లో సందడి చేస్తున్నాయి. ప్రత్యేక మోడల్స్‌లో తయారైన బ్యాగులు, లంచ్‌బాక్సులు, వాటర్‌బాటిల్స్ వివిధ రకాల్లో లభిస్తున్నాయి. చిన్నారుల మనసు దోచుకునేలా మార్కెట్లోకి వచ్చిన పాఠశాల సామగ్రిపై సండే స్పెషల్ కథనం..



ప్రత్యేకంగా బొమ్మల బ్యాగులు, సామగ్రి

పాఠశాలకు వెళ్లమంటూ మారాం చేసే చిన్నారులను ఆకట్టుకునేలా ఆకట్టుకునే మోడల్స్‌లో మిక్కిమౌస్, చోటా భీం, బార్బీడాల్ వంటి బొమ్మలతో కూడిన పాఠశాల వస్తువులు మార్కెట్‌ను ముంచెత్తాయి. గతంలో పిల్లలు మారాం చేయకుండా బడికి పంపాలంటే చాక్లెట్స్, బిస్కెట్ల ఆశ చూపేది. ఇప్పుడా పద్ధతికి తల్లిదండ్రులు చెక్ పెట్టి మార్కెట్‌లో వారి కోసమే ప్రత్యేకంగా తయారు చేసిన బొమ్మల బ్యాగులు, వాటర్‌బాటిల్స్, లంచ్‌బాక్సులు కొనిస్తున్నారు. స్కూలు సామగ్రి ఆడుకునే వస్తువుల్లా ఉండటంతో పిల్లలు అమితంగా ఇష్టపడుతున్నారు. వాటితో పాఠశాలకు పోతున్నామన్న ఫీల్ లేకుండా ఉంటుందని తల్లిదండ్రులు తెలుపుతున్నారు.

సండే స్పెషల్

విభిన్న డిజైన్లలో

చిన్నారులకు నచ్చే లేటెస్ట్ డిజైన్లలో బ్యాగులు, లంచ్‌బాక్సులు, వాటర్‌బాటిళ్లు షాపుల్లో సందడి చేస్తున్నాయి. స్కూల్‌బ్యాగులు, లంచ్‌బాక్సుల్లో బార్బీడాల్, చోటాభీం, డోరిమెన్, పోక్‌మాన్, మోటు పత్లు, మిక్కీమౌస్, ఎఫ్‌బీ, ఆయుష్, లెవియా మోడళ్లున్నాయి. వాటర్‌బాటిళ్లలో స్టీల్, కాపర్, ఇన్సులేటెడ్, సిల్వర్ కోటింగ్‌లతో పాటు మెల్టన్ వంటి వివిధ బ్రాండ్ల వాటర్‌బాటిళ్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్లో త్రీడీ రంగులు, డిజైన్లలో బ్యాగులు, లంచ్‌బాక్సులు వస్తున్నాయి. పిల్లల ఇష్టానికి అనుగుణంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు చల్లని, వేడిగా నిలువ ఉండే లేటెస్ట్ వాటర్ బాటిల్స్ దొరుకుతున్నాయి.

క్వాలిటీ ప్రకారం రేట్లు..

క్వాలిటీ ప్రకారం రేట్లతో స్కూల్ సామగ్రి అమ్ముతున్నారు. పట్టణంలో గాంధీసర్కిల్, పాతబస్టాండ్, పెద్దబజార్, కొత్తబస్టాండ్, గోపాల్‌నగర్, ఆఫీస్‌రోడ్డు, తదితర ప్రాంతాల్లో యాభైకి పైగా షాపుల్లో బ్యాగులు, వాటర్‌బాటిళ్లు, లంచ్‌బాక్సులు అమ్ముతున్నారు. రూ.200 నుంచి రూ.2,000 వరకు వాటర్‌బాటిళ్లు, రూ.250నుంచి రూ.1800 వరకు స్కూల్ బ్యాగులు, రూ.200 నుంచి రూ.1500 వరకు లంచ్‌బాక్సులు క్వాలిటీ బట్టి ధరలున్నాయి. మామూలు నుంచి ఇంటర్నేషనల్ బ్రాండ్ వరకు పట్టణంలో స్కూల్ టాయ్స్ అందుబాటులో ఉన్నాయి. పాఠశాలలు ప్రారంభంతో పట్టణంలోని చదువులు సామగ్రి అమ్మకాలతో దుకాణాలు సందడిగా మారాయి.

పిల్లల కోసం వెరైటీగా..



ఈనెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న దృష్ట్యా చిన్నారుల కోసం అన్ని రకాల వెరైటీల్లో బ్యాగులు, లంచ్ బాక్సులు, వాటర్‌బాటిళ్లు తెప్పిస్తున్నాం. రీజనేబుల్ ధరల్లో అమ్మకాలు చేపడుతున్నాం. ట్రెండీగా ఉండే టాయ్స్ స్కూల్ సామగ్రికి డిమాండ్ ఉంది.

– కొత్త శ్రీనివాస్, వ్యాపారి

బొమ్మల రూపంలో



స్కూల్ బ్యాగులు, ఇతర వస్తువుల మామూలుగానే ఉన్నాయి. పిల్లలకు కావాలి్సనవన్ని బొమ్మల రూపంలో దొరుకుతున్నాయి. సీజన్‌లో అమ్ముడయ్యే బ్యాగులు, లంచ్‌బాక్సులు, వాటర్‌బాటిళ్లు వందలాది డిజైన్లలో ఉన్నాయి. పెద్దపెద్ద నగరాల్లో మాదిరిగా సిరిసిల్లలో అమ్ముతున్నారు.

– కొండవేని మమత, సిరిసిల్ల

పిల్లలు ఇష్టపడుతున్నారు



విభిన్న మోడల్స్‌లో స్కూల్‌బ్యాగులు, లంచ్ బాక్సులను పిల్లలు ఇష్టపడుతున్నారు. త్రిడీ డిజైన్లలో ఉండటం, ఆడుకునే వస్తువుల్లా కనిపించడంతో వాటిని కొనివ్వాలని అంటున్నారు. వారు ఇష్టపడే రీతిలో వెరైటీల్లో స్కూల్‌టాయ్స్ కొనివ్వడం ఆనందంగా ఉంది.

– బిజ్జిగ శ్రీనివాస్, సిరిసిల్ల

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ జనగామ శరత్‌రావు



మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ జనగామ శరత్‌రావు అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ శరత్‌రావు మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ కోట్లాది రూపాయలతో పనులు చేపట్టామన్నారు. అంతకు ముందు జరిగిన చర్చలో దుబ్బాక, ముస్తాబాద్ రహదారి నిర్మాణా నికి మాజీ మంత్రి కేటీఆర్ నిధులు మంజూరు చే యించారని, ఇప్పుడు కొత్త ప్రభుత్వం దానిని చేపట్టాలని కోరారు. ముస్తాబాద్‌లో అక్రమ నిర్మాణా లపై చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు. ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల వివరాలు తెలపాలని గత సమావేశంలో కోరామన్నారు. మండల పరిషత్ పాలకవర్గం పదవికాలం ముగుస్తున్న క్రమంలో చివరి సర్వ సభ్యసమావేశం సందర్భంగా ఎంపీపీ శరత్‌రావు ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎంపీటీసీలు రామచంద్రారెడ్డి, మంజుల, శ్రీనివాస్, షాదుల్, లలిత, స్వేచ్ఛ, సవిత, శ్రీధర్‌ను ఎంపీడీవో రాజేందర్, ఇన్‌చార్జి ఎంపీవో శ్రీనివాస్, మండల పరిషత్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. వివిధశాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యువత ఉద్యోగాలపై దృష్టిసారించాలి



వేములవాడ రూరల్: నాగాయపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై మారుతి

వేములవాడరూరల్: యువత ఉద్యోగాలపై దృష్టిసారించాలని వేములవాడ రూరల్ ఎస్సై మారుతి అన్నారు. వేములవాడ రూరల్ మండలం నాగాయపల్లిలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించగా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత విలాసాలకు అలవాటు పడి జీవితాలను పాడు చేసుకోవద్దన్నారు. ఈనెల 13న సిరిసిల్ల పట్టణ పరిధిలోని కల్యాణ లక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో సుమారు 60కి పైగా కంపెనీల ఆధ్వర్యంలో వెయ్యికి పైగా ఉద్యోగ అవకాశాలతో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని అన్నిగ్రామాల నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీసెల్ అధ్యక్షుడు రొండి రాజు, లక్ష్మణ్, అంజయ్య, తిరుపతి, మల్లేశం, నవీన్, మహేశ్, పరశురాం, ప్రభాకర్, ప్రణయ్, శ్యాంసుందర్, రమేశ్, కానిస్టేబుల్ శ్రీనివాస్, సతీశ్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై శేఖర్‌రెడ్డి కోరారు. ఈనెల 13న సిరిసిల్లలోని కల్యాణలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో 50కి పైగా కంపెనీలు వస్తున్నాయని, ఇందులో వెయ్యికి మందికి పైగా ఉద్యోగాలు కల్పించే వీలు ఉందన్నారు. జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'చెరువును కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'



జిల్లెల్ల చెరువు శిఖం భూమిలో మట్టి పోస్తున్న ట్రాక్టర్

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్లలో కొత్త చెరువు కబ్జాకు గురవుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొత్త చెరువు శిఖం భూమిని కబ్జా చేసేందుకు తన్నీరు గోపాల్‌రావు, అబ్బాడి మల్లారెడ్డి, కొద్రపేట బాల్‌రెడ్డి అనే వ్యక్తులు జేసీబీ, ట్రాక్టర్లతో కొద్దిరోజులుగా మట్టిని నింపుతున్నారని ఇరిగేషన్ ఈఈ కార్యాలయంలో ఇటీవల ఫిర్యాదు చేసినట్లు శనివారం 'సాక్షి'కి తెలిపారు. అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని రైతు సంక్షేమ సంఘం జిల్లెల్ల రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి చెరువు శిఖం భూమి కబ్జాను అడ్డుకోవాలని కోరుతున్నారు.

పరామర్శ

చందుర్తి: మండలంలోని రామారావుపల్లికి చెందిన లింగంపల్లి శ్రీనివాస్ ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామస్వామి, జోగాపూర్ ఎంపీటీసీ సభ్యుడు మ్యాకల గణేశ్, సనుగుల సింగిల్‌విండో చైర్మన్ ముకుందరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు కేతిరెడ్డి నాగిరెడ్డి, అజయ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

రుద్రంగి: మండలకేంద్రానికి చెందిన నంద్యాడపు నర్సింగ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. డీసీసీ కార్యదర్శులు తిరుపతి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, లింగం, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు ఎర్రం గంగ నర్సయ్య, పల్లి గంగాధర్, తదితరులు ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డిపేట: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామ రైతులు గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట హనుమాన్ ఆలయంలో వరద పాశం పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇల్లందుల శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, లక్ష్మీనారాయణ, సత్యంరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

- కేసు నమోదు చేసిన పోలీసులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్‌పై సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. మండల కేంద్రానికి చెందిన నేవూరి దేవేందర్‌రెడ్డి అనే వ్యక్తి వాట్సాప్ గ్రూప్‌లో ఎస్సైపై తప్పుడు ప్రచారం చేసినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీగా గెలుపొందడంపై మండలకేంద్రంలోని పాత బస్టాండ్‌లో మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ.. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఓటర్లు మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించడంపై వారికి కృతజ్ఞతలు తెలిపారు. మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, గిరిధర్‌రెడ్డి, పందిర్ల లింగంగౌడ్, దేవానందం, శ్రీనివాస్‌రెడ్డి, బాబు, శ్రీని వాస్, రాంరెడ్డి, రాజేందర్, రాజునాయక్, బుచ్చాగౌడ్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి



వేములవాడరూరల్: : నాగాయపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



బోయినపల్లి: బడిబాటలో భాగంగా ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

వేములవాడరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ ఉపాధ్యాయులు గ్రామాల్లో ప్రచారాలు నిర్వహిస్తున్నారు. బడిబాట కార్యక్రమాల్లో భాగంగా వేములవాడ రూరల్ మండలంలోని ప్రధానోపాధ్యాయులు శనివారం పలు గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. సర్కారు పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి గ్రామాల్లో ర్యాలీలు తీశారు. అనంతరం ఇంటింటా తమ పిల్లలను సర్కార్ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మన ఊరు–మన బడిలో భాగంగా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ఎంపీపీ రేణుక, ఎంఈవో రఘుప తి, మాజీ సర్పంచ్ అమృత, ఎంపీటీసీ మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోయినపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని ఎంఈవో శ్రీనివాస దీక్షిత్ కోరారు. మండలంలోని నీలోజిపల్లి, వెంకట్రావుపల్లి, కొదురుపాక, నర్సింగాపూర్, బోయినపల్లి, బూర్గుపల్లి గ్రామాల్లో నిర్వహించిన బడిబాటలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కార్ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, యూనిఫాం, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి. సత్యనారాయణ, అన్నాడి ప్రతాప్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, తిరుపతినాయక్, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



బహుమతులు అందిస్తున్న సీఐ వేంకటేశ్వర్లు

కోనరావుపేట: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని మరిమడ్ల క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన 85 టీమ్‌లు పాల్గొన్నాయి. శనివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి సీఐ హాజరై విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. మొదటి విజేత కోనరావుపేట జట్టుకు మాజీ జెడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్ రూ. 20వేలు, రెండో విజేత మరిమడ్లకు విజయభాస్కర్‌రావు రూ. 10వేలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకులు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. క్రీడలతోనే శారీరక ధారుడ్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రేణుక, మాజీ సర్పంచ్ మాట్ల అశోక్, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, జింక శ్రీనివాస్, సింగం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య



రాజవ్వ (ఫైల్)

కోనరావుపేట: అనారోగ్యంతో బాధపడుతూ ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మంగళ్లపల్లి కి చెందిన అవురం రాజవ్వ (46) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. శనివారం తెల్లవారుజామున ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న ఎస్సై ఆంజనేయులు అక్కడికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త చంద్రయ్య, కుమారుడు శరత్, కూతురు శ్వేత ఉన్నారు. చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

బోయినపల్లి: శాలివాహన సంఘం మండల కమిటీ ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా నెల్లుట్ల జనార్దన్, గౌరవ అధ్యక్షుడిగా ఇల్లెందుల అంజయ్య, ఉపాధ్యక్షులుగా కొరెపు మహేందర్, ఎలగందుల రవి, ప్రధాన కార్యదర్శిగా నాంపల్లి మల్లేశం, బెక్కంటి పర్శరాములు, కోశాధికారిగా రాచర్ల రాజేశం, కార్యవర్గ సభ్యులుగా మొగిలిపాలెం రాజేశం, ఆవునూరి అంజయ్య, గంగాధర మల్లేశం, నెల్లుట్ల రాజు, నాంపల్లి మల్లేశం, రాచర్ల సత్యనారాయణ, కోరెం నర్సన్న, ఎలగందుల మల్లేశం, విలాసాగర్ శంకరయ్య, సిరికొండ ప్రసాద్ ఎన్నికయ్యారు.

కవాతును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కోనరావుపేట: మాదిగల ఆత్మగౌరవ కవాతు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి మాదిగ అన్నారు. శనివారం నిమ్మపల్లిలో వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సంఘాల ఆధ్వర్యంలో గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్ గద్దెనిర్మాణం, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామ కమిటీలు నిర్మించాలన్నారు. జూలై 7న వరంగల్‌లో జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలన్నారు. ఇందుకు ప్రతి గ్రామం, మండలాలనుంచి పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దప్పుల నాగరాజు మాదిగ, మాట్ల పోశయ్య, లింగంపల్లి జాన్, మల్యాల లచ్చయ్య, దొబ్బల భూమయ్య, సుధాకర్, జాన్సన్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు



ఘనంగా పోచమ్మ బోనాలు

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో శనివారం రెడ్డి జనసమితి (రెడ్డి సంఘం) ఆధ్వర్యంలో శనివారం పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. దప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, అందరూ సంతోషంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రెడ్డిసంఘం అధ్యక్షుడు ఎడమల బాల్‌రెడ్డి, సిరిసిల్ల సింగిల్‌విండో వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణారెడ్డి, నాయకులు పూర్మాని రాంలింగారెడ్డి, గంగరాజు రెడ్డి, బాలలింగారెడ్డి, జయరాం రెడ్డి, సంజీవరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, హనుమంత రెడ్డి, కృష్ణా రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, గంగారెడ్డి, నారాయణ రెడ్డి, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.